చొరవ చూపితే పూర్వ వైభవం..!

- ఎన్టీఆర్ నిర్మించిన టెక్కలి ఆసుపత్రి భవనంపై నీలినీడలు
- శిథిలస్థితికి చేరినా పట్టించుకోని అధికారులు

న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

ఆ భవనం ఘనచరితకు నిలువెత్తు సాక్ష్యం.. అన్న ఎన్టీఆర్ ఆకాంక్షల ప్రతిరూపం.. మూడు దశాబ్దాల పాటు వైద్యసేవలందించి ప్రస్తుతం అతీగతి లేక శిథిలస్థితికి చేరుకుంది... ఇదీ టెక్కలి నడిబొడ్డున ఉన్న జిల్లా ఆసుపత్రి పూర్వ భవనం దుస్థితి. వినియోగంలోని తీసుకొస్తే పూర్వ వైభవం వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక దృష్టిసారించాలని కోరుతున్నారు.



వినియోగంలోకి వస్తేనే గుర్తింపు..

1994లో టెక్కలి నుంచి ఎన్టీఆర్ పోటీ చేశారు. ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టాక టెక్కలికి వంద పడకల ఆసుపత్రిని మంజూరుచేశారు. రూ.10 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించి పూర్తిచేశారు. 1996లో ప్రారంభించారు. తర్వాత 2018లో అప్పటి మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు ప్రాంతీయాసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అభివృద్ధి చేశారు. నూతన భవన సముదాయంలోకి ఆసుపత్రి మారాక ఈ భవన సముదాయం నిరుపయోగంగా మారింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

జిల్లా ఆసుపత్రిని నూతన భవన సముదాయంలోకి తరలించి పాతభవనాన్ని వృథాగా వదిలేయడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ముందు నుంచి తాళాలు వేసి ఉన్నా వెనుక నుంచి ఇనుప గజాలు తొలగించి ఆకతాయిలు లోపలకు ప్రవేశిస్తున్నారు. అత్యవసర వార్డుతో పాటు పలు విభాగాల్లోని ఆక్సిజన్ పైపులైన్లు, కిటికీలు, తలుపులకు ఉన్న వస్తువులను పెకిలించి ఎత్తుకెళ్లారు. విద్యుత్తు తీగలు, చక్రాల కుర్చీలు, మంచాలు, బల్లలు కనిపించకుండా పోయాయి. జనరేటర్‌లోని కొన్ని విడిభాగాలను సైతం ఎత్తుకెళ్లారు. ట్రామాకేర్‌కు సంబంధించిన రూ.20 లక్షల విలువైన అంబులెన్స్ ఆసుపత్రి ఆవరణలో ఉండిపోయి తుప్పు పడుతోంది. కొవిడ్ సమయంలో రోగులకు ప్రాణవాయువు అందించేందుకు రెడ్డీస్ ల్యాబ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంటు వృథాగా మారింది. ట్రామాకేర్‌కు చెందిన 500 ఎంఏ ఎక్స్‌రే ప్లాంటు పాత భవనంలోనే ఉండిపోయింది.



చోరీకి గురైన కిటికీ గజాలు

ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించేలా ప్రణాళిక..

టెక్కలి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించేందుకు గతంలో ప్రణాళిక చేశారు. వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లుగా దాన్ని అమలు ఊసే లేదు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఇందులోకి తరలించడం ద్వారా ఏకీకృతసేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పలువురు సూచిస్తున్నారు. డివిజన్ కేంద్రంలో భూగర్భగనులశాఖ సహాయ సంచాలకుడి కార్యాలయం మొదలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ట్రెజరీ, ఐసీడీఎస్, వ్యవసాయశాఖ ఏడీ, గృహనిర్మాణ సంస్థ ఏఈ, డీఈ కార్యాలయాలు ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. డీఎల్‌పీవో, గృహనిర్మాణ, విద్యుత్తు ఏఈ, మత్స్యశాఖ కార్యాలయాలు ఇతర శాఖలకు చెందిన భవనాల్లో నిర్వహిస్తున్నారు.



ఆసుపత్రి ఆవరణలో వృథాగా ప్రాణవాయువు ప్లాంటు

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య... పాత జిల్లా ఆసుపత్రి భవనాన్ని ఇతర శాఖలకు కేటాయించడం మా పరిధిలో లేదు. ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అందులో ఉన్న ఎక్స్‌రే యంత్రం, అంబులెన్స్ పూర్తిగా పనిచేయని స్థితికి చేరుకోవడంతో విడిచి పెట్టాం. పాత ఆసుపత్రి భవనంలో వెనుక నుంచి కిటికీ గజాలు తొలగించి వస్తువుల్ని దొంగిలించిన అంశంపై పోలీసులకు సమాచారం అందించాం.

\- సూర్యారావు, సూపరింటెండెంట్, టెక్కలి జిల్లా ఆసుపత్రి

దరఖాస్తు గడువు పెంపు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంచినట్లు ప్రిన్సిపల్ డి.పరశురామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 8, 9 తేదీల్లో దరఖాస్తుల్లో తప్పులు సవరించుకోవడానికి అవకాశమిచ్చినట్లు తెలిపారు.


ఏపీటీపీసీ ఛైర్మన్‌గా వజ్జ బాబూరావు

నామినేటెడ్ పదవుల్లో జిల్లా నేతలకు చోటు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, పలాస, బూర్జ, శ్రీకాకుళం అర్బన్

కూటమి నేతలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నియమిత పదవుల పంపకం మొదలైంది. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం కొన్ని ముఖ్యమైన కార్పొరేషన్లకు ఛైర్మన్, సభ్యులను ఖరారు చేసింది. పలాసకు చెందిన వజ్జ బాబూరావును ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీటీపీసీ) ఛైర్మన్‌గా నియమించింది. బూర్జ మండలం పెద్దపేటకు చెందిన ఆనెపు రామకృష్ణంనాయుడిని ఏపీ మార్క్‌ఫెడ్ సభ్యుడిగా, శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు పంచాయతీ పరిధి రాయిపాడుకు చెందిన సీర రమణయ్యకు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు.

పార్టీ విజయానికి కృషిచేసి..



టెక్కలి నియోజకవర్గం నుంచి తెదేపా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. 2002లో అదే పార్టీ తరపున పలాస-కాశీబుగ్గకు పురపాలక సంఘానికి తొలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. అప్పట్లో పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2014లో ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి వైకాపాలో చేరారు. పలాస నియోజకవర్గ సమన్వయకర్తగా వ్యవహరించారు. తర్వాత వచ్చిన ఎన్నికల్లో పోటీ చేసి గౌతు శివాజీపై ఓటమి పాలయ్యారు. అనంతరం తెదేపాలో చేరారు. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేశారు. ప్రస్తుతం 24వ వార్డు కౌన్సిలర్‌గా, తెదేపా రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

ఆనెపు రామకృష్ణంనాయుడు



2006లో తెలుగు యువత బూర్జ మండల అధ్యక్షుడిగా, 2008లో తెలుగు యువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా పని చేశారు. పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, బూర్జ జడ్పీటీసీ సభ్యుడిగా వ్యవహరించారు. 2015లో జడ్పీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

సీర రమణయ్య



ఎన్టీఆర్‌పై అభిమానంతో తెదేపాలో చేరారు. 1983 నుంచి కార్యకర్తగా పని చేస్తున్నారు. అరసవల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా, డైరెక్టర్‌గా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా రెండు పర్యాయాలు చేశారు. రాగోలు సర్పంచిగా, తెదేపా మండల అధ్యక్షుడిగా మూడు సార్లు, తెలుగు రైతు అధ్యక్షుడిగా వ్యవహరించారు.

జిల్లాకు భారీ వర్ష సూచన

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నదులు, వాగుల్లో నీటి ప్రవాహాన్ని గమనిస్తూ ఉండాలన్నారు. రహదారిపై నీరు ప్రవహిస్తే రాకపోకలను నియంత్రించాలని చెప్పారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 08942 240557 నంబరుకు ఫోన్ చేయవచ్చునన్నారు. అధికారులు పని చేస్తున్న కేంద్రాలను విడిచి వెళ్లరాదని, సెలవులు కూడా రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

కూలిన కల్వర్టు... తప్పిన ప్రమాదం



కంచిలి మండల పరిధి నారాయణబట్టి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డులో భాగంగా ఉన్న కల్వర్టు అకస్మాత్తుగా కూలింది. ఈ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కంచిలి, సోంపేట ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్తుంటారు. కూలినప్పుడు రాకపోకలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఒడిశా సరిహద్దులో ప్రాంతాల్లోని భైరిపురం, పోలేరు, ఒడిశాకు చెందిన వేర్వేరు గ్రానైట్ క్వారీల నుంచి భారీ పరిమాణంలో రాళ్లు ఈ దారిలో తీసుకెళ్తుండటంతో కల్వర్టు సామర్థ్యం తగ్గినట్లు అధికారులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్య పరిష్కరించాలన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి, కంచిలి గ్రామీణం

చౌకగా కొనేయ్.. అక్రమంగా అమ్మేయ్..!

\- ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

జాతీయ ఆహార భద్రత పథకానికి జిల్లాలో అక్రమార్కులు తూట్లు పొడుస్తూనే ఉన్నారు. ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని పక్కదారిపట్టిస్తున్నారు. కొందరు మిల్లర్లు, కిరాణా వ్యాపారులు, డీలర్లు స్థానిక నేతల అండదండలతో అక్రమ వ్యాపారానికి పాల్పడుతూ రూ.కోట్లలో ఆర్జిస్తున్నారు. గత ఐదేళ్లలో ఈ దందా మరింత పెరిగిపోయింది.. ఇందుకోసం ప్రత్యేక ముఠాలే ఊరూరా తిరుగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదంతా ఆయా స్థానిక అధికారులకు తెలిసినా వారికి సైతం చేయి తడిపి జిల్లా సరిహద్దులనే దాటించేస్తున్నారు.



ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

జిల్లాలో 6,71,803 మంది కార్డుదారులు ఉన్నారు. 1,603 దుకాణాలు ఉన్నాయి. అన్ని కార్డులపైనా సగటున నెలకు 11 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. గత ఐదేళ్లలో 7,501.44 క్వింటాళ్ల బియ్యాన్ని విజిలెన్స్ అధికారుల దాడుల్లో పట్టుబడ్డాయి. 219 మందిని అరెస్టు చేశారు. 2022 సంవత్సరంలో 2,259.85 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారంటే అక్రమ రవాణా ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇక పట్టుబడకుండా పోయిందో ఊహించుకోవచ్చు.

ఈ ఏడాదిలో పట్టుబడ్డ కొన్ని సంఘటనలు

శ్రీకాకుళం: ఈనెల 12న నగర పరిధిలోని పెద్దపాడుకు చెందిన ఓ వ్యక్తి 592 కిలోలు 14 బస్తాల బియ్యాన్ని చిలకపాలెం నుంచి నరసన్నపేటకు ఆటోలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేశారు.

సారవకోట: ఈ నెల 11న అవలంగి గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన 680 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు.

కంచిలి: జూన్ 12న నారాయణపుట్టిలో ఇంట్లో నిల్వ ఉంచిన 2,700 కిలోల బియ్యం లభ్యం


మెళియాపుట్టి: మే 18న చాపరలో 1,230 కిలోల స్వాధీనం

గార: మే 20న బూరవెల్లిలో 1,050 కిలోల సరకు దొరికింది.

ఎచ్చెర్ల: ఏప్రిల్ 10న కుశాలపురంలో 4,030 కిలోలను పట్టుకున్నారు.

బండెనక బండి కట్టి..

గ్రామాలు, పట్టణాల్లో ఎండీయూ వాహనం వద్ద లబ్ధిదారులు బియ్యాన్ని తీసుకున్న వెంటనే కిలో రూ.12-15 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఆ వాహనాన్ని అనుసరిస్తూ ద్విచక్ర వాహనం లేదా ఆటోల్లో బస్తాలను ఎక్కించి బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. కొందరు డీలర్లు, రేషన్ వాహనదారులు వేలిముద్ర వేయించుకొని డబ్బులు కావాలా, బియ్యం కావాలా అని బహిరంగంగానే అడిగి మరీ దోచేస్తున్నారు. వీటిని మిల్లర్లు, ఇతర వ్యాపారులకు రూ.20-25 విక్రయిస్తున్నారు.



వ్యాపారులే అధికం..

ప్రధానంగా చిన్న, చిన్న కిరాణా దుకాణదారులే ఎక్కువగా ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమ వ్యాపారానికి తెరలేపుతున్నారు. ఇటీవల పట్టుబడిన ఘటనల్లో ఎక్కువ శాతం వీరే ఉన్నారు. స్థానికంగా కొందరు ముఠాలుగా ఏర్పడి చిన్న మొత్తంలో సేకరించి వ్యాపారులకు అప్పగిస్తున్నారు. వీరు రాత్రికిరాత్రే ఆటోలు, లారీల్లో రైస్ మిల్లులు, కాకినాడ వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన రైస్‌మిల్లర్లు పాలిష్ చేసి వాటిని తిరిగి మార్కెట్లోకి తీసుకొస్తున్నారు.

నిరంతరం నిఘా..

చౌక బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా పెట్టాం. దీనిపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నాం. అక్రమ నిల్వలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పేదలకు అందిస్తున్న బియ్యం నాణ్యమైనవి. పోషకాలతో కూడుకున్నవి ప్రభుత్వం చెబుతోంది. లబ్ధిదారులు బయట కొనుగోలు చేయకుండా రేషన్ బియ్యం వినియోగించాలి.

\- బి.ప్రసాదరావు, ఎస్పీ ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, శ్రీకాకుళం

రేషన్ బియ్యం కొనేందుకు ఊరూరా ప్రత్యేక ముఠాలు

గుట్టుచప్పుడు కాకుండా తరలిపోతున్న వైనం

25న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 25న నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న మాత్రలు వేసుకోనివారు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు మాత్రలు తప్పనిసరిగా వేయాలని, శతశాతం పంపిణీ జరిగేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

వచ్చే జూన్ నాటికి ఓడరేవు సిద్ధమవ్వాలి

మూలపేట గ్రామస్థుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జూన్ 12 నాటికి మూలపేట ఓడరేవు సిద్ధమవ్వాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షగా రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో మంగళవారం మూలపేట, విష్ణుచక్రం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన అంశాలు, జరిగిన పొరపాట్లపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తాను, ఎంపీగా రామ్మోహన్‌నాయుడు ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పటికీ నాటి అధికారులు కనీసం తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. బ్రిటిష్ పాలనలా పోలీసులను పెట్టి ప్రజల్ని భయపెట్టి ఒప్పించారన్నారు. తాము జగన్ లాంటివాళ్లం కాదని, అభివృద్ధిని అడ్డుకోబోమన్నారు. ప్రజల్ని రెచ్చగొడితే అభివృద్ధి ఆగుతుందని నాడు ఆలోచించామని చెప్పారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైనంతగా ప్రణాళిక చేస్తామన్నారు. మరోవైపు పనులు వేగవంతం చేసేందుకు అన్నిచర్యలు చేపట్టాలని సూచించారు. మూలపేటకు సమీపంలో 2,326 ఎకరాల ఉప్పుభూములు ఉన్నాయని, వాటిని స్వాధీనపర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. 2,700 ఎకరాల థర్మల్ పవర్‌ప్లాంటు భూమిని బ్యాంకుల వేలంలో వేరేవారు కొనుగోలు చేశారని, వాటినీ సేకరిస్తామనిచెప్పారు. మూలపేట నుంచి భోగాపురం వరకు ఎనిమిది వరుసల రహదారి నిర్మాణం జరిగితే పరిశ్రమలు, పర్యటకం, అభివృద్ధి అవకాశాలు పూర్తిస్థాయిలో పెరుగుతాయన్నారు. విమానాశ్రయం ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో సుదర్శన్‌దొర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శంకుస్థాపనతో సరిపెట్టారు..!

- పల్లెదారులను గాలికొదిలేసిన వైకాపా ప్రభుత్వం
- ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో అధికం

- **పలాస** మండలం ఎస్‌జీ పురం రహదారి నుంచి మహదేవపురం మీదుగా కొటారింగి తాళభద్ర వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2.11 కోట్లు మంజూరు చేశారు. ఆయా పనులకు 2020లో అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు శంకుస్థాపన చేశారు. చిప్స్, క్రషర్ బుగ్గి వేసి వదిలేశారు.
- **వజ్రపుకొత్తూరు:** పూండీ-గల్లీ నుంచి శివరాంపురం వరకు రూ.90 లక్షలతో సిమెంట్ దారి నిర్మించాలి. ఇక్కడ కూడా చిప్స్, క్రషర్ బుగ్గి వేసి వదిలేశారు. ఇదే మండలంలో తేరపల్లి-కొండవూరు రహదారికి రూ.89 లక్షలు మంజూరు చేశారు. తారు రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది.
- **కంచిలి:** తలతంపర ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి సామంతపుట్టుగ వరకు 1.13 కిలోమీటర్ల మేర రూ.67 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించాలి.

..పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో గ్రామీణ రహదారులు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. వాటి రూపురేఖలు మార్చడానికి ఆరేళ్ల కిందట తెదేపా ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. రూ.కోట్లు మంజూరైనా ఇప్పటివరకు పనులు పూర్తి చేసిన దాఖలాలు లేవు. వైకాపా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడంతో నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఆయా పనులకు మోక్షం కలుగుతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రాకపోకలకు వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

\- న్యూస్‌టుడే, కాశీబుగ్గ, పలాస, వజ్రపుకొత్తూరు

87 పనులు మంజూరు..

ఏషియన్ మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు (ఏఐఐబీ) నుంచి 2018లో పలాస నియోజకవర్గానికి రూ.26.33 కోట్ల విలువైన 27 పనులు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్, తారు రహదారులు, వంతెనల నిర్మాణం చేపట్టాలి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రూ.80.15 కోట్లతో 60 పనులు మంజూరయ్యాయి. ఆయా పనులకు అప్పటి ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. 2019లో ఎన్నికల అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిపై సమగ్ర దృష్టి కేంద్రీకరించలేదు. మంజూరైన ప్రత్యేక నిధులు సైతం వినియోగించుకోలేదు. పలాస నియోజకవర్గంలో 50 శాతం వరకు, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 40 శాతం వరకు పనులు జరిగాయి. రెండు నియోజకవర్గాల్లో 29 పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. 41 పనులు అరకొరగా జరిగాయి. 17 పనులు పూర్తయ్యాయి.



పలాస మండలం కొటారింగి తాళభద్రకు వెళ్లే రహదారి దుస్థితి



వజ్రపుకొత్తూరు మండలంలో అధ్వానంగా శివరాంపురం రహదారి

బిల్లులు చెల్లించాలి..

గతంలో చేపట్టిన కొన్ని పనులకు ఇంకా బిల్లులు చెల్లించలేదు. సొమ్ము అందితే మిగిలినవి చేస్తామని గుత్తేదారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితికి సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపుతాం.

\- శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఎస్ఈ పంచాయతీరాజ్ శాఖ, శ్రీకాకుళం

జనసేనాని ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



అనివెట్టి మండపంలో వేద పారాయణం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: తిరమల లడ్డూ ప్రసాదం విషయంలో వెలుగులోకి వచ్చిన తప్పిదాలకు వైకాపా హయాంలోని పాలకమండలి సభ్యులు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ డిమాండు చేశారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా శ్రీకాకుళం నగరంలోని అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం పూజలు చేశారు. వేదపారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతిసే కుట్రకు పాల్పడిన వైకాపా నాయకులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మూగ వేదన.. నరక యాతన..!



గ్రాసం కోసం వెళ్లిన ఓ గేదె మురుగు కాలువలో పడి విలవిలలాడింది. చాలా సేపు ఎటు కదల్లేక నరక యాతన అనుభవించింది. ఈ ఘటన శ్రీకాకుళం నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆరసవల్లి వాసి జి.రమణ తన గేదెను బాజీపేట సమీపంలో మేతకు తీసుకెళ్లారు. గ్రాసం కోసం రోడ్డు దాటి పొలాలోకి వెళ్తుండగా మధ్యలో ఉన్న కాలువ దాటలేక గేదె అందులో పడిపోయింది. బయటకు రాలేక ఉక్కిరిబిక్కిరైంది. స్థానికులు తాళ్ల సాయంతో బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. చివరికి పొక్లెయిన్ ద్వారా మూగ వేదనకు విముక్తి కల్పించారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్



ఉద్యోగ భద్రత కల్పించండి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పొరుగు సేవల విధానంలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లుగా పని చేస్తున్న ఉద్యోగులు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపో ముందు మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నూతన మద్యం విధానం తీసుకొస్తుందని.. దీంతో తమ ఉద్యోగాలు పోయి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో అధికారులకు వినతి పత్రం అందజేశారు. పొరుగు సేవల ఉద్యోగుల జిల్లా సంఘం నేతలు బి.ధర్మారావు, బి.శ్రీను, సీహెచ్ గురిబాబు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పొరుగు సేవల ఉద్యోగులు

టోల్ ప్లాజా వద్ద ఆందోళన

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల కారు, టాటా మ్యాజిక్ వాహన యజమానులు, చోదకులు మంగళవారం కరపాడు టోల్ ప్లాజా వద్ద ఆందోళనకు దిగారు. కరపాడు నుంచి లక్ష్మీపురం టోల్ గేట్‌కు దూరం తక్కువగా ఉన్నందున స్థానిక వాహనాల చోదకులు ఆధార్ కార్డు చూపిస్తే రుసుం వసూలు చేయకుండా ఉచితంగా పంపాలని డిమాండు చేశారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపారు. సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎమ్మెల్యే అశోక్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.



రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలు

కదలని నీరు.. మళ్లీ బేజారు..!



నరసన్నపేట మండలం చిక్కాలవలస రైల్వే అండర్ పాసేజీ వద్ద పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వంతెన కింద మూడు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో మంగళవారం రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నరసన్నపేటతో పాటు జలుమూరు మండలంలోని పలు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాతం కలిగింది. వర్షం పడిన ప్రతిసారి ఇలాగే అవస్థలు పడుతున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని శ్రీకాకుళం రోడ్డు ఏఈఎన్ బీవీఎస్ మూర్తి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

ఊరు కదిలింది.. మొక్కు చెల్లించింది..!



వ్యవసాయ పనులు ముగిసిన తరుణంలో గార మండలం కళింగపట్నం పంచాయతీ నగరాలపేట గ్రామ దేవత అసిరితల్లి అమ్మవారికి మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవాయిద్యాల నడుమ గ్రామస్థులు శోభాయాత్ర నిర్వహించారు. ఆలయం వద్ద ప్రదక్షిణలు చేసి మహిళలు ముర్రాటలు సమర్పించి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, గార

డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల్లో 2018, 2019 విద్యా సంవత్సరాల్లో చేరిన ఓల్డ్ రెగ్యులేషన్ విద్యార్థుల ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం విడుదల చేశారు. బీఏ, బీఎస్సీ, బీసీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్ కోర్సుల్లో మొత్తం 1,154 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 822 మంది (71.23 శాతం) ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. ఎటువంటి సందేహాలున్నా 15 రోజుల్లోగా పునర్మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

> శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో ఈ నెల 19న ఒకే రోజు రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. దుండగులు 13 తులాల బంగారం, 3 కిలోల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. వేలిముద్రలు సేకరించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

> కాశీబుగ్గ పట్టణంలోని రోటరీ నగర్‌లో ఈ ఏడాది మే 25న ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. దొంగలు 46 తులాల బంగారు ఆభరణాలు, రూ.18 వేలు ఎత్తుకెళ్లిపోయారు.

> ఫిబ్రవరి 27న కాశీబుగ్గ పోతనపల్లి వీధిలో దొంగలు పడ్డారు. ఓ ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని రూ.10 లక్షల నగదు, 15 తులాల బంగారం, 4 కిలోల వెండి వస్తువులు చోరీకి పాల్పడ్డారు.

LHMS AP Police

చెప్పి ఊరెళ్తే చింత లేనట్లే..!

- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో దొంగతనాలకు అడ్డుకట్ట
- అవగాహన కొరవడటంతో పెరుగుతున్న చోరీలు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చెలరేగిపోతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని నగరాలు, పట్టణాల్లోనే ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. పోలీసులు రాత్రి వేళ గస్తీ కాస్తున్నప్పటికీ వాటి సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. దొంగతనాలకు అడ్డుకట్టవేసేందుకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని సూచిస్తున్నా ప్రజలు పట్టించుకోవట్లేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా నష్టం జరిగిన తర్వాత పోలీసుస్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. అలా కాకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకుంటే ఇల్లు భద్రంగా ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.



పీఎన్ కాలనీలో చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు


ముందు ఏం చేయాలంటే..

మీ స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌కు వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ అయ్యాక అందులో పేరు, వివరాలు నమోదు చేయాలి. మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ అయ్యాక వన్ టైం పాస్‌వర్డ్, యూనిక్ ఐడీ వస్తాయి. అంతటితో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

ఇలా పట్టుకోవచ్చు..

ఊరు వెళ్లేముందు ఎల్ఎంహెచ్ఎస్ యాప్‌లో రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీ, ఏ సమయానికి వెళ్తారు.. తిరిగి ఎప్పుడొస్తారనే సమాచారం పొందుపరచాలి. వెంటనే ఆ వివరాలు కమాండ్ కంట్రోల్ రూంకి చేరతాయి. సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పని చేసే నిఘా కెమెరా, ఇతర పరికరాలను అమరుస్తారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలున్నా కంట్రోల్ రూంలో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ వాహనాలకు సమాచారం వెళ్లి.. క్షణాల్లో పోలీసులు నేరుగా దొంగలను పట్టుకునేందుకు వీలవుతుంది. జిల్లావాసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకుని చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు సహకరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచిస్తున్నారు.

జిల్లాలో యాప్ వినియోగం ఇలా..



రంజీ జట్టులో సిక్కోలు క్రీడాకారుడికి చోటు



విజయ్

శ్రీకాకుళం అర్బన్, టెక్కలి, న్యూస్‌టుడే: రంజీ ట్రోఫీ ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టులో సిక్కోలు క్రీడాకారుడు త్రిపురాన విజయ్‌కు చోటు దక్కింది. టెక్కలికి చెందిన యువకుడు ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు. రెండేళ్ల కిందట రంజీ జట్టులో ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, ఏపీఎల్‌లోనూ ప్రతిభ కనబర్చి గుర్తింపు పొందాడు. గతేడాది అండర్-23 రాష్ట్రస్థాయి పోటీల్లో ఆరు మ్యాచులు ఆడి 30 వికెట్లు తీశాడు. జోనల్, జిల్లాస్థాయిలోనూ అత్యుత్తమ ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. విజయ్ ఎంపికపై జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హాసన్ రజా, కోశాధికారి షైలానీ, మెంటార్ ఇలియాస్ అహ్మద్ అభినందించారు.

ఇన్‌ఛార్జి డీఎఫ్‌వోగా సంజయ్

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి జిల్లా అటవీశాఖాధికారిగా ఎల్.సంజయ్‌ను నియమిస్తూ ఆ శాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం ఈయన పార్వతీపురం మన్యం జిల్లా సబ్ డీఎఫ్‌వోగా పని చేస్తున్నారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి డీఎఫ్‌వోగా విజయనగరం జిల్లా అటవీశాఖాధికారి వెంకటేశ్వరరావు బాధ్యతలు నిర్వర్తించారు.

ఎంపీడీవోలకు స్థానచలనం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలో 23 మంది ఎంపీడీవోలకు స్థాన చలనం కల్పిస్తూ కలిగింది. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయినది
వి. తిరుమలరావు	మందస	కంచిలి
పి. చంద్రకుమారి	మెళియాపుట్టి	పాతపట్నం
పి. సూర్యనారాయణ	కవిటి	మందస
ఎన్. రమేష్‌నాయుడు	పలాస	వజ్రపుకొత్తూరు
సీహెచ్. ఈశ్వరమ్మ	వజ్రపుకొత్తూరు	సోంపేట
పి. వి. వి. మోహన్‌కుమార్	సరుబుజ్జిలి	సారవకోట
పి. వెంకటరాజు	ఆమదాలవలస	లావేరు
ఆర్. కాళీప్రసాద్	ఎల్. ఎన్. పేట	హిరమండలం
ఎం. పావని	కొత్తూరు	సరుబుజ్జిలి
బి. శైలజ	హిరమండలం	శ్రీకాకుళం
కె. సురేష్‌కుమార్	లావేరు	సంతకవిటి
ఎస్. రామ్మోహనరావు	శ్రీకాకుళం	గార
జి. వి. రవికుమార్	సంతకవిటి	పోలాకి
ఎం. ఈశ్వరరావు	ఇచ్ఛాపురం	రణస్థలం
ఎస్. హరిహరరావు	పొందూరు	ఎచ్చెర్ల
వి. నీరజ	కంచిలి	కొత్తూరు
కె. అప్పలనాయుడు	విశాఖపట్నం	జలుమూరు
కె. వసంతకుమార్	తూర్పుగోదావరి	పలాస
పి. తిరుపతిరావు	పశ్చిమగోదావరి	బూర్జ
ఎం. మన్మథరావు	విశాఖపట్నం	పొందూరు
పి. నర్సింహప్రసాద్	పశ్చిమగోదావరి	మెళియాపుట్టి
పి. శ్రీనివాసరావు	విజయనగరం	ఎల్. ఎన్. పేట
ఆర్. వెంకట్రావు	విశాఖపట్నం	ఆమదాలవలస

ఎక్సైజ్‌శాఖ డీసీగా శ్రీకాంత్ రెడ్డి

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీకాంత్ రెడ్డిని నియమితులయ్యారు. ప్రస్తుతం కాకినాడ డీసీగా పని చేస్తున్న ఈయనను జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

పరిహారాన్ని ఫలహారంలా బొక్కేశారు

మూలపేట భూసేకరణపై ఆరోపణల పర్వం

టెక్కలి, సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: మూలపేట పోర్టు భూసేకరణ పరిహారం, పీడీఎఫ్ చెల్లింపుల్లో వైకాపా నేతలు, కార్యకర్తలు అడ్డగోలుగా దోచుకున్నారని, దానికి అధికారులు పూర్తిస్థాయిలో సహకరించారని మాజీ సర్పంచి జీరు భీమారావు ఆరోపించారు. మంగళవారం మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో సుదర్శన్‌దొర మూలపేట గ్రామాన్ని సందర్శించారు. సమీక్ష సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలను వివరించాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అచ్చెన్నాయుడు కోరారు. దీనిపై మాజీ సర్పంచి జీరు భీమారావు పలు ఆరోపణలు చేశారు. భూసేకరణకు 42 మంది రైతులు 50 ఎకరాల భూమిని ఇవ్వలేదని, అయితే వారి 1బీలు ప్రస్తుతం తీస్తే తక్కువ భూములు చూపిస్తున్నాయని చెప్పారు. భూసేకరణకు భూములు ఇచ్చినప్పటికీ వారి 1బీలు ఇప్పటికీ వైకాపా నాయకుల పేరునే వస్తున్నాయన్నారు. మరోవైపు పీడీఎఫ్‌ల చెల్లింపు, గుర్తింపులో తెదేపా వారికి అన్యాయం జరిగిందన్నారు. నౌపడలో ముంపు సమస్య ఉందని, దానికి బదులుగా ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని కోరారు. వాటిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. భూముల రీసర్వే బుధవారం నుంచే ప్రారంభించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పీడీఎఫ్‌లపై విచారణ జరిపించాలని సూచించారు.

రైలు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రాజేష్ (పాతచిత్రం)

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం కె.గోపాలపురం వద్ద జరిగిన రైలు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన రేగేటి రాజేష్(32) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేగేటి జయరాం, జయలక్ష్మి చిన్న కుమారుడు రాజేష్ విశాఖపట్నంలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇటీవల వినాయక ఉత్సవాలకు స్వగ్రామానికి వచ్చి రెండు రోజుల క్రితం విశాఖ తిరుగు ప్రయాణం అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం సాయంత్రం గుణుపురం నుంచి రవుర్కెలా వెళ్తున్న రైలు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తల్లిదండ్రులకు తెలిపారు. వారు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహం తమ కుమారుడిదేనని గుర్తించి, కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుతో వృద్ధుడి మృతి



రాము

జి.సిగడాం, న్యూస్‌టుడే: మండల పరిధి టంకాలదుగ్గివలస గ్రామానికి చెందిన టంకాల రాము (56)ను పాము కాటు వేయడంతో మృతి చెందారు. పాలకండ్యాం పంచాయతీ అయ్యారిపేట వద్ద వరి పొలంలో మంగళవారం ఎరువు వేస్తుండగా నాగుపాము కాటు వేయడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. రైతులు ఆటోలో పొందూరు సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్తుండగా కన్నుమూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జి.సిగడాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిపై కుమారుడి దాడి

నందిగాం, న్యూస్‌టుడే: ఆస్తి పంపకాల్లో వివాదం తలెత్తి కన్న తండ్రిపైనే కుమారుడు దాడికి పాల్పడిన ఘటన నందిగాం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కణితివూరు గ్రామానికి చెందిన మోహనరావుకు ముగ్గురు కుమారులు. అందరికీ మూడు ఇళ్లు పంచారు. ఈ క్రమంలో రెండో కుమారుడికి ఇచ్చిన ఇల్లు తనకు కావాలని, ఈ మేరకు దస్తావేజులపై సంతకం పెట్టాలని మూడో కుమారుడు విజయానందం తండ్రిపై ఒత్తిడి తెచ్చారు. అందుకు ఆయన ఒప్పుకోకపోవడంతో మంగళవారం దాడి చేసి గాయపరిచారు. మోహనరావు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మహ్మద్ ఆలీ చెప్పారు.

నెయ్యి కల్తీ వ్యవహారంపై

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యి కల్తీ విషయంలో వాస్తవాలు ప్రజలకు తెలియాలని.. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని మాజీ సభాపతి తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు. దీని వెనక కుట్ర త్వరలోనే బహిర్గతవుతుందని వ్యాఖ్యానించారు. ఆమదాలవలసలోని నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు సరైన పాలన అందించకుండా వేంకటేశ్వరస్వామిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. నెయ్యి కల్తీ వైకాపా ప్రభుత్వం చేసిందంటూ ప్రజల్ని మభ్యపెట్టేలా రోజుకొకరితో ప్రకటనలు చేయించడం.. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం ఎంతవరకు సబబు? వైకాపా పాలనలో నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిని నల్ల జాబితాలో పెట్టాం. నాణ్యత లేని 18 నెయ్యి లారీలను వెనక్కి పంపాం. కూటమి ప్రభుత్వం 14 లారీలనే వెనక్కి పంపింది' అని సీతారాం పేర్కొన్నారు. కాళింగ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దుంపల రామారావు, బూర్జ ఎంపీపీ కర్ణన దీప, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, నాయకులు ఖండ్యాపు గోవిందరావు, గుమ్మడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



రూ.5,00,284 చెక్కును మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు అందజేస్తున్న డీసీసీబీ ఉద్యోగులు

గుజరాతీపేట(శ్రీకాకుళం), సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు జిల్లాకు చెందిన విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక చేయూతనందించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో కలిసి రూ.1,05,000 సమకూర్చారు. శ్రీకాకుళం నగరంలో మంగళవారం జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఆ చెక్కును రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావుకు అందజేశారు. ● వరద బాధితుల సహాయార్థం డీసీసీబీ ఉద్యోగులు తమ ఒక రోజు జీతం రూ.5,00,284 నగదును విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సంతబొమ్మాళి మండలం మూలపేటలో మంగళవారం అందజేశారు.



రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావుకు చెక్కు అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు

ఉపాధి శిక్షణకు 27న మౌఖిక పరీక్ష

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజాం నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(నైరడ్)లో ఈనెల 27న మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టరు ఎం.రాజీవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, టైలరింగ్, కంప్యూటర్ ట్యాలీ, బేసిక్స్‌పై తర్ఫీదు ఇస్తామని, స్త్రీలకు టైలరింగ్, హోం నర్సింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, మగ్గం పనిలో శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 19 నుంచి 40 ఏళ్ల వయసు గల వారు హాజరుకావచ్చునని సూచించారు.

శివాని ఫార్మసీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం చిలకపాలెం సమీపంలోని శ్రీశివాని ఫార్మసీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడు గుర్తింపు లభించిందని ప్రధానాచార్యులు డా.రాజ్‌కిరణ్, యాజమాన్య సభ్యులు దుప్పల వెంకటరావు, సనపల శ్రీనివాసరావు, దుర్గా శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13, 14 తేదీల్లో విశ్రాంత ఉపకులపతి డా. ఎస్‌హెచ్ అన్సారి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి డైరెక్టర్ డా.సుభాని ఎ షరీఫ్, ఆదేష్ కాలేజి ఆఫ్ ఫార్మసీ ప్రధానాచార్యులు డా. రీఛా మాదాన్‌తో కూడిన బృందం కళాశాలను సందర్శించిందని చెప్పారు. అన్ని అంశాలు పరిశీలించి 3.16 పాయింట్లతో ఏ గ్రేడు గుర్తింపు ఐదేళ్ల పాటు ఇచ్చారన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు డా.వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డా.జి.టి.చంద్రశేఖర్, అధ్యాపకులు యు.శ్రీవెంకటేష్, జి.ఈక్షిత, పీడీ టి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు పత్రం చూపుతున్న ప్రధానాచార్యులు రాజ్‌కిరణ్, యాజమాన్య సభ్యులు వెంకట్రావు తదితరులు

డ్రోన్ పరిజ్ఞానంపై నైపుణ్యం పెంపొందించుకోండి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య రజని

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు డ్రోన్ పరిజ్ఞానంపై నైపుణ్యం పెంపొందించుకోవాలని డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలోని సమావేశ మందిరంలో మంగళవారం డ్రోన్ సాంకేతికతపై వర్సిటీ పరిశోధన అభివృద్ధి కేంద్రం, రోసిన్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన ఇన్నోవేటివ్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ (ఐసీడీటీ) సంయుక్తంగా ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇటీవల ఐసీడీటీ సంస్థతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా వర్సిటీ విద్యార్థులు అధునాతన సాంకేతికతపై నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఐసీడీటీ ఆపరేషనల్ హెడ్ పి.సాయినాథ్‌మనోహర్, ఆర్అండ్‌డీ ఇంజినీర్లు కె.జ్యోతి, వి.పావని, వర్సిటీ రెక్టార్ బిడ్డికి అడ్డయ్య, రిజిస్ట్రార్ పీలా సుజాత, ఆర్అండ్‌డీ డీన్ డా.ఎన్.లోకేశ్వరి, సహాయ డీన్ డా.ఎన్.మధులత, ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

ఇళ్లు త్వరగా నిర్మించుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో 2019-24 మధ్య కాలంలో మంజూరైన ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీవో రమేష్‌నాయుడు లబ్ధిదారులకు సూచించారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, ఇంజినీరింగ్ సహాయకులతో 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. 2025 మార్చి 31 లోపు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఆ తర్వాత నిర్మించినా...బిల్లులు మంజూరు కావన్నారు. ప్రతి గ్రామంలో సభలు నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

కోట దుర్గమ్మ ఊరేగింపు

కంచిలి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కంచిలి మండలం జలంత్రకోట కోటమ్మతల్లి(కోట దుర్గమ్మ) అమ్మవారిని ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చి కొలువు దీర్చారు. సోమవారం రాత్రి భాజా భజంత్రీలు, మేళ తాళాలతో కార్యక్రమం జరిగింది. సోంపేట, కంచిలి మండలాలకు చెందిన భక్తులు, స్థానిక ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.


పూజలందుకుంటున్న దుర్గమ్మ

వేరే ప్రాంతానికి చేపల విక్రయాల తరలింపు

స్పందనకు వందనం

సోంపేట, న్యూస్‌టుడే: తీరంలో చేపల వ్యర్థాల వల్ల కలిగే ఇబ్బందులకు మోక్షం లభించింది. చేపల వ్యాపారులు బారువ బీచ్ పరిధిలో విక్రయాలు నిర్వహించి వ్యర్థాలు అక్కడే పారబోస్తుండటంతో సందర్శకులు, స్థానికులు పారిశుద్ధ్య సమస్యలతో అవస్థలు పడుతున్నారు. దీనిపై ఈనాడులో 'చేపల వ్యర్థాలతో దుర్గంధం' శీర్షికన కథనం రావడంతో మెరైన్ సీఐ రమేష్ కుమార్ స్పందించి వేరే చోట కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

కంచమ్మతల్లి ఆలయ అభివృద్ధికి విరాళాలు

కంచిలి, న్యూస్‌టుడే : కంచిలి, పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం కంచమ్మతల్లి ఆలయ అభివృద్ధికి విరాళాలు అందజేస్తున్నారు. మంగళవారం బాసుబంజిరి, పద్మతుల గ్రామాల భక్తులు రూ.15 వేలు చొప్పున విరాళం అందజేయగా మరి కొంత మంది వస్తు, ధన రూపంలో ఇస్తున్నారు.

శిథిల భవనం.. విధుల్లో భయం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల పురోగతికి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం కీలకం. ఇక్కడి కార్యకలాపాల విషయం పక్కన పెడితే కార్యాలయం శిథిలావస్థకు చేరింది. కాలం చెల్లిన భవనాల్లో ఉద్యోగులు భయంతో విధులు నిర్వర్తిస్తున్నారు.


అసంపూర్తిగా నూతన కార్యాలయం

భారంగా మారిన దస్త్రాలు, సామగ్రి సంరక్షణ

పట్టించుకోని వైకాపా ప్రభుత్వం

తెదేపా హయాంలో 2017లో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ నిధులు రూ. కోటి అంచనాతో కొత్త భవనం నిర్మించారు. చివర దశలో పనులు నిలిచిపోగా వైకాపా పాలనలో భవనాన్ని పూర్తి చేయలేదు. ఏడేళ్లుగా అలాగే ఉండిపోయింది. కూటమి ప్రభుత్వ హయాంలో తలుపులు, కిటికీలు, టైల్స్ ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నీ సమస్యలే

ప్రస్తుతం ఉన్న భవనం గోడలు బీటలు వారడంతోపాటు వారి పైకప్పు పెచ్చులూడి, చెదలు పట్టి తలుపులు, కిటికీలు పాడవుతున్నాయి. గోడలోని ఇనుప ఊచలు బయటకొచ్చేంత బలహీనంగా భవనం తయారైంది. మరుగు దొడ్డి సైతం ఇదే పరిస్థితి. సమావేశ మందిరంలో పైకప్పు నుంచి నీరు చిమ్ముతుండటంతో వర్షం పడితే నీరు నిలిచి పోతోంది. పాలనపరమైన కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎంపీపీ, ఎంపీడీవో, ఏవోకి తప్ప మిగతా అధికారులకు గదులు లేవు. ఒకే గదిలో సీనియర్, జూనియర్ సహాయకులు, సాంకేతిక, కంప్యూటర్ సహాయకులు, అటెండర్లు విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీలకు పంపిణీ చేసే ప్రగతి సామగ్రిని సైతం భద్ర పరుచుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. దస్త్రాలు సంరక్షణ కత్తిమీద సాముగా మారింది.


పాత భవనం పెచ్చులూడి కనిపిస్తున్న ఇనుప ఊచలు

ప్రతిపాదనలు పంపించాం

కార్యాలయం సంబంధించి చివర దశ పనులు మిగిలి ఉన్నాయి. ఆలస్యం కావడం వల్ల నిర్మాణ అంచనా వ్యయం పెరిగింది. ఇప్పటికే అదనపు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు పూర్తి చేస్తాం. – **నాగభూషణం, పంచాయతీరాజ్ మండల ఇంజినీరు, వజ్రపుకొత్తూరు**

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	9440437129
పలాస	8008574279
కవిటి గ్రామీణం	8309638875
పలాస గ్రామీణం	7386408926
కంచిలి గ్రామీణం	9704568738

సమస్య : దినవారీ బజారుకు తూర్పు, ఉత్తర గేట్ల వద్ద పరిశుభ్రత పనులు జరగడం లేదు. మురుగు, చెత్తతో ఇబ్బంది పడుతున్నాం. – బి.ప్రకాశరావు, ఇచ్ఛాపురం

సమాధానం : శుభ్రం చేయిస్తాం. **-పి.ఉపేంద్రకుమార్, ఎంఎస్ఐ, ఇచ్ఛాపురం**

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే:

సమస్య: పలాస మండలం కిష్టుపురంలోని కాలువలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. –గ్రామస్థులు

సమాధానం: రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. **-సాయి, పంచాయతీ కార్యదర్శి, లక్ష్మీపురం**

అడుగడుగునా ఇబ్బందులే..!



వజ్రపుకొత్తూరు మండలం రెయ్యిపాడు నుంచి తేరపల్లి మీదుగా కొండవూరు వరకు ఉన్న గ్రావెల్ రోడ్డు ఛిద్రమైంది. వర్షం పడితే ప్రయాణం నరకంగా మారింది. ఈ రోడ్డు అభివృద్ధికి 2019లో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ శంకుస్థాపన చేశారు. అనంతరం వైకాపా రావడంతో పనులు చేయలేదు. ఉద్దానం ప్రాంతంలో పండే జీడి, కొబ్బరి పంటలను మార్కెట్‌కు తరలించాలంటే ఈ రోడ్డే ఆధారం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో పలువురు ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందించారు. ఈ విషయమై పీఆర్ ప్రాజెక్టు డీఈ రవిబాబు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పనులు చేపట్టే గుత్తేదారుకు చెప్పామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.
–న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

అధ్వానం..అవస్థలమయం

కంచిలి నుంచి బొగాబెని వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రాకపోకల వేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసౌకర్యంగా ఉందని వాపోతున్నారు. అత్యవసర సమయంలో గ్రామాల్లోకి అంబులెన్స్ రావాలన్న తీవ్ర జాప్యం జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు. ఈ విషయం ఆర్అండ్‌బీ ఏ.ఈ మోహనరావు వద్ద ప్రస్తావించగా తక్షణ మరమ్మత్తులకోసం రూ.30 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం**



రహదారే.. డంపింగ్ యార్డు కాదు..!



పలాస మండలం బ్రాహ్మణతర్లాలోని కడి వీధి సమీపంలో రోడ్డు పక్కనే చెత్త పారబోస్తుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, ఆ దారిలో నడిచేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖ దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

నియంత్రిక ఏర్పాటుపై అసంతృప్తి

కాశీబుగ్గలో కేటీ రహదారిలో విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో పెడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. 20 మీటర్ల దూరంలోని వీధిలోకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు. కాశీబుగ్గ విద్యుత్తు ఏఈ నాగభూషణం మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల అనుమతితోనే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, కాశీబుగ్గ



రోడ్డు నాణ్యత పరిశీలన

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో అభివృద్ధి పనులపై జిల్లా నిఘా విభాగం ఎస్పీ ప్రసాదరావు బృందం తనిఖీలు చేపట్టింది. పురపాలక సంఘంలో అంతరకుడ్డ, ఇందిరాకాలనీ, కిడ్నీ ఆసుపత్రి రహదారి పనుల్లో నాణ్యత లోపించిందని ఫిర్యాదులు వెళ్లటంతో మంగళవారం పరిశీలించారు. రోడ్డు నమూనాలను ప్రయోగశాలకు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో డీఎస్పీ కిరణ్ కుమార్, డి.ఇ.ఇ సత్యనారాయణ, పురపాలక సంఘం అధికారులు పాల్గొన్నారు.


రహదారిని పరిశీలిస్తున్న ప్రసాద్‌రావు బృందం

వంశధార నీరు అందించాం.. సమస్యలన్నీ పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఏం చేశామో చెప్పుకొనేలా పనిచేస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. 11వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం రైతులకు వంశధార నీరు వచ్చేలా చేసిన ఘటన జీవితంలో మర్చిపోలేనని తెలిపారు. ప్రజలకు తాగునీరు రోజు విడిచి రోజు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజాసమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలని, వీధి దీపాల ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇస్తామన్నారు. విజయవాడ వరదల వల్ల సూపర్ సిక్స్ పథకాల అమలు అడ్డంకిగా మారిందని, త్వరలోనే తెదేపా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందన్నారు. ఈ సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, తెదేపా నాయకులు గాలి కృష్ణారావు, కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షసూచనతో అంతటా అప్రమత్తం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జిల్లాకు భారీ వర్ష సూచన ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తమ కార్యాలయంలో 91141 15363 నంబరుతో కంట్రోల్‌రూం ఏర్పాటుచేసినట్లు తహసీల్దారు పి.వెంకటరావు తెలిపారు. 24 గంటలూ ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. డొంకూరు, పెద్ద లక్ష్మీపురం, శివకృష్ణాపురం, బూర్జపాడు, చిన లక్ష్మీపురం, ఇన్నేసుపేట, రత్తకన్న ప్రాంతాల వారికి జాగ్రత్తలు సూచించామన్నారు. లోతట్టు ప్రాంతాల వారు, పాత ఇళ్లలో నివాసం ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేయడం జరిగిందన్నారు.


తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంలో అధికారుల చర్చలు

కూటమి ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం

కవిటి గ్రామీణం,కంచిలి గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని తెదేపా నేతలు అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం ప్రజల్లోకి తీసుకెళ్లారు. 100 రోజుల పాలనపై అవగాహన కల్పించారు. గత ఐదేళ్లలో పాలనతో విసిగిన ప్రజలకు కొన్ని రోజుల్లోనే కూటమి ప్రభుత్వం మంచి చేసిందన్నారు.


కవిటి గ్రామీణం: **దూగానపుట్టుగలో..**


కంచిలి గ్రామీణం: **కత్తివరంలో..**


వజ్రపుకొత్తూరు గ్రామీణం: **గోవిందపురంలో..**

సాగునీటి వనరుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలి


ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి, న్యూస్‌టుడే: కంచిలి మండల పరిధిలో సాగునీటి వనరుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వీటి అభివృద్ధికి కావాల్సిన నిధులపై అంచనాలు తయారు చేసి ఇస్తే, వాటి నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ నర్తు రామారావు తెలిపారు. మంగళవారం కంచిలి మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ పైల దేవదాసురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జయరాజ్ ఎంపీడీవో నీరజ, తహసీల్దారు జయలక్ష్మి, ఎంఈవో శివ రాంప్రసాద్ వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న కరెంటు కష్టాలు


పుర కమిషనర్‌కు ఎమ్మెల్యే లేఖను అందిస్తున్న తెదేపా నాయకులు పాపారావు, జాని

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పురుషోత్తపురం వార్డు ప్రజలకు తెదేపా హయాంలో ఇళ్లు మంజూరయ్యాయి. అక్కడ మౌలిక వసతులు కల్పించడంలో ఆ తరువాత వచ్చిన వైకాపా నిర్లక్ష్యం వహించింది. వీధుల్లో దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన రోడ్లు సైతం ఇక్కడ లేవు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ రాసిన లేఖను పుర కమిషనర్ నల్లి రమేష్‌కు మంగళవారం తెదేపా నాయకులు నందికి జాని, గాలి పాపారావు అందించారు. 2017-18లో పలువురికి అప్పటి తెదేపా ప్రభుత్వం పురుషోత్తపురం గ్రామ సమీపంలోనే స్థలాలు కేటాయించింది. వారు ఇళ్లు కట్టుకోవడంతో ఎమ్మెల్యే ప్రారంభించారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తారన్న తరుణంలో ప్రభుత్వం మారిపోయింది. కాలనీ వాసులకు అయిదేళ్లు కష్టాలు తప్పలేదు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పైవిధంగా స్పందించి, సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.


జూనియర్ కళాశాలలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు

సేవాగుణం అలవర్చుకోవాలి

పలాస, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సేవాగుణం పెరగాలని పలాస ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి అన్నారు. జాతీయ సేవాపథకం వ్యవస్థాపక దినోత్సవ మంగళవారం పలాస ప్రభుత్వ డిగ్రీ, పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేర్వేరుగా నిర్వహించారు. జూనియర్ కళాశాల ఆవరణలో పరిసరాల శుభ్రం చేపట్టారు. కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, వ్యాయాయ సంచాలకులు డాక్టర్ పి.మధు, అధ్యాపకులు పి.వి.రమణ, ఎన్.శ్రీనివాస పట్నాయక్, ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపల్ కె.నరసింహమూర్తి, జాతీయసేవాపథకం అధికారులు పాల్గొన్నారు.

బావులు శుభ్రం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బావులు శుభ్రం చేశారు. పారిశుద్ధ్య విభాగ అధికారి ఉపేంద్రకుమార్ పర్యవేక్షణలో పురపాలక, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుద్ధ్యకార్మికులు మంగళవారం పనులు చేశారు. లాలాపేట, బెల్లుపడ, బెల్లుపడకాలనీ, మంగళవారంపేట, రథంవీధి, గొల్లవీధి, బలరాంపేట, కాళ్లవారివీధి, గిలాయివీధి, పొందర వీధి, కంద్రవీధి తదితర ప్రాంతాల్లో ఉన్న బావుల్లో క్లోరిన్ కలిపారు. పరిసరాలను శుభ్రం చేశారు.



మంగళవారంపేట ప్రజాబావిలో క్లోరినేషన్ చేస్తున్న పుర సిబ్బంది

సకాలంలో ఎరువులు వినియోగిస్తే మేలు

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, సోంపేట, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వరి పంటకు సకాలంలో ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం జగతి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు ఆశిస్తున్న పురుగు, తెగుళ్లు పరిశీలించి ఏయే పురుగు మందు వినియోగించాలో రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీపీఏ కళ్యాణి, ఎంపీఈవో లలిత కుమారి, రైతులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం గ్రామీణం: **కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు**

❑ మండల పరిధి బొడ్డకాళి, కేదారిపురం గ్రామాల్లో వ్యవసాయాధికారిణి భార్గవి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎరువులు వాడకం, చీడపీడల నివారణపై సూచనలు చేశారు.

❑ పాత్రకొండ, కర్తలిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రైతుల ప్రయోజనాల కోసమే నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు తెలిపారు. ★ వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలిలో రైతులకు తక్కువ పెట్టుబడితో వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎరువులు వేసుకునే విధానం, నీటి శాతం, తదితర అంశాలపై వ్యవసాయాధికారులు తగు సూచనలు చేశారు.

బాధ్యతగా పనిచేస్తా

పలాస, న్యూస్‌టుడే: తెదేపా ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వర్తిస్తానని ఏపీ టీపీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన వజ్జ బాబూరావు అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాసింజర్ రైళ్లు ఆపాలి.. కవిటి గ్రామీణం: జాడుపూడి రైల్వే స్టేషన్‌లో ప్రతి పాసింజర్ రైలు ఆపాలని కవిటి మండల తెదేపా నాయకులు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

కార్పొరేషన్‌లో చోటు కల్పించటం హర్షణీయం

పలాస, న్యూస్‌టుడే: మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటుకు తీర్మానం చేయటం హర్షణీయమని పలాస నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్మథరావు పేర్కొన్నారు. పలాస తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీషను కలిసి మంగళవారం సత్కరించారు. చంద్రబాబు మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. అనంతరం వరద బాధితులకు రూ.21 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బారికి, కార్యదర్శి తాతయ్య, కోశాధికారి వెంకటరావు, సహాయ కార్యదర్శి బాబురావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే అఘాయిత్యాలకు అడ్డుకట్ట


విద్యార్థికి రుతురుమాళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస, న్యూస్‌టుడే: విద్యార్థినులు, యువతులంతా చైతన్యంతోనే అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎమ్మెల్యే శిరీష పేర్కొన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ, ఉత్తర అమెరికా తెలుగుసంఘం, హోప్ ఫర్ లైఫ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థినులకు రుతురుమాళ్లు అందజేశారు. సమాజంలో అఘాయిత్యాలు, ఆత్మహత్యాలు పెరుగుతున్నాయని మహిళలంతా దృఢంగా ఉండాలన్నారు. కౌమార దశలో తమ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోప్‌ఫర్‌లైఫ్ ప్రతినిధులు డాక్టర్ హిమజ, ఆశాజ్యోతి, సైకాలజిస్టులు డాక్టర్ సంగీత, దామోదర్, ప్రధానోపాధ్యాయుడు దాశరథి, చిట్టిబాబు, రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

? నందిగాం మండలం సైలాడ పంచాయతీ బంజీరుపేటలో కాలువలు లేకపోవడంతో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. అధికారులు స్పందించాలి. **- శ్యామలరావు, స్థానికుడు**

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం

- సీహెచ్.రవి, పంచాయతీ కార్యదర్శి, సైలాడ

– న్యూస్‌టుడే, నందిగాం

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

విజయవాడ తరహాలో క్యూలైన్లు

కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం తరహాలో క్యూలైన్లు ఏర్పాటు అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కొత్తమ్మతల్లి ఆలయాన్ని మంగళవారం రాత్రి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ మహేశ్వరరెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఏర్పాట్లపై సిబ్బందితో



సమీక్షించారు. బోయిన రమేష్, ఈవో రాధాకృష్ణ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

అందరికీ అభివృద్ధి ఫలాలు



చంగుడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



నరసన్నపేట మండలం మాకివలసలో..



లింగాలవలసలో తెదేపా నాయకుడు దుంగ స్వామిబాబు ఆధ్వర్యంలో..



బొప్పాయిపురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నేతలు, అధికారులు

జగన్ సర్కార్ వైఫల్యాలతో తిరోగమనంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టి అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యేలు, నాయకులు పేర్కొన్నారు. మంగళవారం టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి, వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. – న్యూస్‌టుడే బృందం

రూ.లక్షల వ్యయం.. లక్ష్యానికి దూరం..!

న్యూస్‌టుడే, సారవకోట, జలుమూరు, నరసన్నపేట గ్రామీణం



ఉర్లాంలో అలంకారప్రాయంగా మిగిలిన వైనం

వైకాపా హయాంలో రైతులకు స్థానికంగా సేవలందించేలా ఉన్నతమైన ఆశయంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్నదాతలకు కావాల్సిన ఎరువులు, విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించడానికి వీలుగా ప్రతీ ఆర్బీకేకు ఒక కియోస్క్ యంత్రాన్ని అందించారు. ఎరువులు, విత్తనాలు అందుకున్న రైతు చేతి వేలు అనుసంధానించడానికి సైతం ఈ యంత్రంలో అవకాశం కల్పించారు. దీని కోసం సీఎంఏపీ యాప్‌ను అందుబాటులో తెచ్చారు. రైతులకు అవసరమయ్యే సూచనలు, సలహాలకు యూట్యూబ్ ఛానళ్లను వినియోగించి ఈ యంత్రాల ద్వారా వీడియోలు ప్రసారం చేయాల్సి ఉంది. సాంకేతిక సమస్య, ఇతర కారణాల వల్ల కొన్ని కేంద్రాల్లో ఇవి పనిచేయడంలేదు. మరమ్మతులు చేసే నాథుడు లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

ప్రజాధనం వృథా

రూ.లక్షల ఖర్చుతో వీటిని ఏర్పాటు చేసినప్పటికీ లక్ష్యానికి దూరంగానే ఉన్నాయి. దీంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. యంత్రాలు సరఫరా చేసిన గుత్తేదారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. రైతుల కోసం ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలపై దృష్టి సారించి వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

సారవకోట మండలానికి 20 యంత్రాలు మంజూరు కాగా కేవలస, అవలంగి కేంద్రాల్లో ఉన్న యంత్రాలు ఏడాదిగా పనిచేయడం లేదు. దీంతో చరవాణుల ద్వారా వ్యవసాయ సహాయకులు సేవలు అందిస్తున్నారు. యంత్రాలు పనిచేయని విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని ఏవో వెంకటరావు తెలిపారు.

● జలుమూరు మండలంలో 24 యంత్రాలు కేంద్రాలకు అందించారు. జలుమూరులో రైతు సేవా కేంద్రం లేకపోవడంతో వ్యవసాయ కార్యాలయంలోనే దీనిని ఉంచారు. రావిపాడు, సుబ్రహ్మణ్యపురం, యలమంచిలి గ్రామాల్లో సచివాలయాల్లోనే ఉన్నాయి. ఇవి కూడా అంతంత మాత్రంగానే వినియోగిస్తున్నారు. ఏవో సురేష్ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా.. అన్నీ పనిచేస్తున్నాయని, కొన్ని చోట్ల విద్యుత్తు సౌకర్యం లేక, మరి కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదని, అన్ని చోట్ల వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు.

● నరసన్నపేట మండలంలో ఉన్న 24 రైతు సేవా కేంద్రాల్లో 24 యంత్రాలు ఉన్నాయి. ఎక్కడా వీటిని వినియోగించిన దాఖలాలు లేవు. చరవాణుల ద్వారా మాత్రమే రైతులకు సేవలు అందిస్తున్నారు. దీంతో వీటిని ఎందుకు సరఫరా చేశారో రైతులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఏవో పి.సునీత మాట్లాడుతూ.. అన్ని యంత్రాలు పనిచేస్తున్నాయని, చరవాణుల్లో అందుబాటులో ఉన్న యాప్‌ల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా సేవలు అందిస్తున్నామని చెప్పారు.



అవలంగి రైతు సేవా కేంద్రంలో పనిచేయని కియోస్క్ యంత్రం

క్రషర్ పరిశ్రమలో తనిఖీలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రేగులపాడు పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 33లో నాలుగు హెక్టార్లలో లీజుకు నిర్వహిస్తున్న విశ్వం క్రషర్ పరిశ్రమలో మంగళవారం విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. తవ్వకాలతో పాటు నిల్వలను సీఐ డీవీ సతీష్‌కుమార్, జియాలజిస్టు సురేష్‌కుమార్ పరిశీలించారు. ఎప్పటివరకు లీజు ఉంది...తవ్వకాలు ఎంతవరకు జరిగాయి..ఎంతమేర ప్రభుత్వానికి చెల్లింపులు చేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా గత 5 నెలలుగా పరిశ్రమలో పనిచేస్తున్న తమకు వేతనాలు ఇవ్వడం లేదని సుమారు 30 మంది కార్మికులు అధికారుల వద్ద వాపోయారు.

తప్పిన ప్రమాదం



నౌపడ- టెక్కలి రహదారిలో ఇజ్జువరం బస్సు స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. టెక్కలి నుంచి పలాస వైపు మంగళవారం బస్సు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గొర్రెల మందను డ్రైవర్ తప్పించబోయి రహదారి పక్కన గుంతలో కూరుకుపోయింది. 13 కేవీ లైన్‌కు సమీపంలో వాహనం ఆగిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

మహిళల ఆరోగ్యం అభివృద్ధికి చిహ్నం



సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, న్యూస్‌టుడే: మహిళల ఆరోగ్యం సమాజ అభివృద్ధికి చిహ్నమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పోషణమాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి నాగమణి, ఎంపీపీ ఆరంగి మురళి, ఉప సర్పంచి కృష్ణబాబు, తెదేపా నాయకులు గొద్దు చిట్టిబాబు, ఎస్.చంద్రశేఖర్, చింతు రామారావు, ఎంపీడీవో మధుసూదనరావు, రమణమ్మ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నందిగాం: ప్రాయశ్చిత్త దీక్ష చేపడుతున్న జనసేన నేతలు

నందిగాం,పాతపట్నం,హిరమండలం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ అన్నారు. ఈ మేరకు నందిగాం పంచాయతీ పెంటూరు వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ●పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో భాజపా నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ●ధనుపురం గ్రామస్థులు పవన్ దీక్షకు మద్దతు పలికారు. అనంతరం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న నెయ్యల భీముడికి రూ.10 వేలు అందజేశారు.



పాతపట్నం: నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం వద్ద భాజపా నాయకుల ఆధ్వర్యంలో..

నిర్లక్ష్యపు వెలుగులు



నందిగాం మండలం శివరాంపురం పంచాయతీ కోటిపల్లి గ్రామంలోని వీధుల్లో సుమారు 10 వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథాతో పాటు గ్రామ పంచాయతీకి విద్యుత్తు బిల్లులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. గ్రామ సచివాలయ సిబ్బందికి తెలియజేసి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి జానకమ్మ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

అసలే వానాకాలం.. ఆపై పొదలు



నరసన్నపేట మండలం ఉర్లాం శివారులో సచివాలయం వద్ద విద్యుత్తు నియంత్రిక చుట్టూ ముళ్ల పొదలు అల్లుకోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి ముళ్లపొదలు, పనికిరాని మొక్కలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉర్లాం విద్యుత్తు ఉప కేంద్రం ఏఈ బాలకృష్ణ వద్ద ప్రస్తావించగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తెలియజేస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

గొట్టాలే మిగిలాయి



ప్రియాగ్రహారం పంచాయతీ రామయ్యవలసలో పది నెలల కిందట జల్‌జీవన్ మిషన్ పథకం కింద సుమారు 75 గృహాలకు కుళాయిల ఏర్పాటుకు గొట్టాలు అమర్చారు. నేటి వరకు వాటి గురించి పట్టించుకోకపోవడంతో అవి దిష్టిబొమ్మల్లా మిగిలాయి. దీంతో పలువురు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది సొంతంగా బోర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ రాజేశ్వరి మాట్లాడుతూ.. చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పోలాకి

దారి.. అధ్వానంగా మారి

హిరమండలం పంచాయతీ సుభలయ గ్రామం ఎగువ వీధిలో ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోతుండటంతో బురదమయంగా మారుతోంది. దీంతో గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, రహదారికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ ఈవో వైఎస్ఆర్ మూర్తి వద్ద ప్రస్తావించగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి పంచాయతీ పాలకవర్గంతో చర్చిస్తామన్నారు. నిధుల లభ్యత ఆధారంగా పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, హిరమండలం



వాన పడితే అవస్థలే..!



జలుమూరు మండలం కరకవలస కాలనీలో గతంలో వీధిలో వేసిన రహదారి కుంగిపోవడంతో నీరు నిలిచిపోతుంది. వర్షం పడిన ప్రతిసారి వారం రోజుల వరకు నీరు కదలడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈగలు, దోమలతో రోగాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువలు, పక్కా రహదారి నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ రాజ్ శాఖ జేఈ కె.శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైతే పనులు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, జలుమూరు

సంక్షిప్త సమాచారం

పెద్దమడి విద్యార్థికి డెంగీ జ్వరం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పెద్దమడి గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి డెంగీ జ్వరంతో శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్నాడు. మూడు రోజుల క్రితం పాఠశాల నుంచి నరసన్నపేటలో ఉన్న తండ్రి వద్దకు వెళ్లాడు. శనివారం రాత్రి జ్వరం రావడంతో.. ఆదివారం నరస్నపేటలో చికిత్స చేయించగా.. డెంగీగా గుర్తించారు. వెంటనే శ్రీకాకుళం తరలించి చికిత్స అందించినట్లు ప్రిన్సిపల్ అజిత్ కుమార్ పేర్కొన్నారు.

మంత్రి దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి దృష్టికి జిల్లా రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులు తమ సమస్యలు తీసుకెళ్లారు. సంఘ అధ్యక్షుడు ఆరంగి రామారావు, కార్యదర్శి రవికుమార్ తదితరులు మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కోరాడ నాగరాజు, అసిరినాయుడు, చిట్టెయ్య, దానయ్య, కోటేశ్వరరావు, అప్పారావు, మురళీ పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి సేవలో విజిలెన్స్ ఎస్పీ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి అమ్మవారిని జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందచేశారు. పురోహితుడు రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: చిట్టివలసలో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం, లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. సుమారు 60 లేగదూడలు ప్రదర్శనకు రాగా ముగ్గురు రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంపతిరావు భారతమ్మ, కింజరాపు ప్రసాదరావు పాల్గొన్నారు.

పశువుల రవాణా..వాహనం సీజ్

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం కమలమ్మకొట్టు కూడలి వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. కొత్తూరు మండలం బలద సంతలో జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మూగజీవాలను కొనుగోలు చేసి, నారాయణవలస సంతలో విక్రయించేందుకు వాహనంపై తరలిస్తున్నారు. తనిఖీలు నిర్వహిస్తుండగా.. అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి, పశువులను కొత్తవలస గోశాలకు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

ఐతమ్‌లో ఎన్‌సీసీ ఎంపికలు



టెక్కలి, న్యూస్‌టుడే: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ ఎంపికలు జరిగాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఎంపికలను కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు ప్రారంభించారు. శ్రీకాకుళం 14వ బెటాలియన్ సుబేదార్ సి.రవికుమార్ పాల్గొన్నారు.

రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



నరసన్నపేట గ్రామీణం: లుకులాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



మెళియాపుట్టి మండలం పరుశురాంపురంలో..

రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం పలుచోట్ల 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి పైర్లు ఆశాజనకంగా ఉన్నాయని, అవసరం మేరకు రసాయనిక ఎరువులు వినియోగించాలని సూచించారు. – న్యూస్‌టుడే బృందం



కోటబొమ్మాళి: చిట్టివలసలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



ప్రతిభ చూపిన క్రీడాకారులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో జరిగిన స్కూల్‌గేమ్స్ తైక్వాండో పోటీల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడావికాసకేంద్రంలో శిక్షణ పొందుతున్న మెండ తపస్వి, ఎస్.మోహిత్, కూన ధరణి ప్రతిభ చూపారు. వచ్చే నెల తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు నర్సిపురం శేఖర్ తెలిపారు. టీమ్ మేనేజర్‌గా పడాల అక్ష వ్యవహరించారు. డీఎస్‌డీవో కల్లేపల్లి శ్రీధర్ క్రీడాకారులను అభినందించారు.

మంచి ప్రవర్తన అలవరుచుకోండి



కారాగారాన్ని పరిశీలిస్తున్న జునైద్ అహ్మద్ మౌలానా

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఖైదీలు మంచి ప్రవర్తన అలవరుచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. స్థానిక ఉప కారాగారాన్ని మంగళవారం జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియతో కలిసి ఆయన పరిశీలించారు. కారాగారంలో సదుపాయాల గురించి ఖైదీలతో మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

టెండరు ప్రకటన

గ్రామ పంచాయతీ కార్యాలయం, టెక్కలి

రేఖా నెం. 177/2024, తే. 24-09-2024ది.

శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, టెక్కలి గ్రామ పంచాయతీనకు ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు-1 నందు తెల్పిన సామాగ్రిని తే. 01-10-2024ది నుండి తే 31-03-2025ది వరకు సప్లై చేయుటకు గాను తే: 28-09-2024ది ఉదయం గం॥ 10-00 నుండి మధ్యాహ్నం గం. 01-00 వరకు ఈ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గానీ లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యోగిచే గాని సీలువేసిన టెండర్లు స్వీకరించబడును. టెండరుదారులు టెండర్ ధరావత్తు చెల్లించి, టెండర్ షరతులకు లోబడి మాత్రమే టెండర్లలో పాల్గొనవలెను. స్వీకరించబడిన టెండర్లను అదే రోజు మధ్యాహ్నం గం॥ 02-00లకు హాజరైన టెండరు దారుల సమక్షంలో తెరవబడును.

షెడ్యూలు-1

వ. సం.	సరఫరా చేయవలసిన సామగ్రి వివరములు	సరఫరా చేయవలసిన కాలము	చెల్లించవలసిన ధరావత్తు
1	పి.హెచ్ మెటీరియల్ (బ్లీచింగ్, పొడిసున్నం, ఫినాయిలు, యం.ఎల్/ఆయిల్, మరియు పారిశుధ్య పనిముట్లు)	తే. 01.10.2024దీ నుండి తే. 31.03.2025 వరకు	రూ. 500/-
2	బోర్‌వెల్ సామాగ్రి (SSR రేట్లకు లోబడి)	తే. 01.10.2024 దీ నుండి తే. 31.03.2025 దీ వరకు	రూ. 500/-
3	కాంట్రాక్ట్ సిబ్బందికి యూనిఫార్మ్ (ఏక రూప దుస్తులు), చెప్పులు, నూనె, సబ్బులు, చేతి గ్లౌజులు మొదలగునవి	తే. 01.10.2024దీ నుండి తే. 31.03.2025దీ వరకు	రూ. 500/-
4	LED వీధి విద్యుత్ దీపములు, డ్రైవర్లు మరియు ఇతర సామాగ్రి	తే. 01.10.2024దీ నుండి తే. 31.03.2025దీ వరకు	రూ. 500/-
5	PWS స్కీముల నిర్వహణ నిమిత్తం అవసరమైన పైపు లైను రిపేరు సామాగ్రి	తే. 01.10.2024దీ నుండి తే. 31.03.2025దీ వరకు	రూ. 500/-
6	ఈ కార్యాలయ నిర్వహణ నిమిత్తం అవసరమైన స్టేషనరీ సామాగ్రి	తే. 01.10.2024దీ నుండి తే. 31.03.2025దీ వరకు	రూ. 500/-

టెండర్లను ఎట్టి కారణము చూపి గాని, చూపకుండా గాని, వాయిదా వేయుటకు గాని, తిరస్కరించుటకు గాని పూర్తి అధికారం యీ గ్రామ పంచాయతీనకు మరియు అందులకు సంబంధించిన అధికారులదైయుండును. పూర్తి షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయ పని వేళలయందు అడిగి తెలుసుకోవలెను.

సం/- కే.వి.వి. జగన్నాధరావు,
కార్యనిర్వహణాధికారి (పంచాయతీ కార్యదర్శి)
గ్రామ పంచాయతీ - టెక్కలి.

లక్ష్యాలు చేరేందుకు కృషి చేయండి

పోలాకి, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన 'మన ఇల్లు..మన గౌరవం' పథకం మండలంలో విజయవంతమయ్యేలా సిబ్బంది కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.మురళీధర్ అన్నారు. మంగళవారం పరిషత్ సమావేశ మందిరంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు.



అనాథాశ్రమాల్లో తనిఖీలు



పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అనాథాశ్రమాల్లో అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ వి.శ్రీలక్ష్మి, ఇతర అధికారులు పరిశీలనలు చేశారు. ఈ సందర్భంగా కె.వి.రమణ మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

భూసర్వే అక్రమాలపై చర్యలు చేపట్టాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో భూసర్వేలో అక్రమాలపై దర్యాప్తు చేసి, బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రసాదరావు, కృష్ణారావు, యత్తిరాజు డిమాండ్ చేశారు. కర్లెమ్మ గ్రామంలో తహసీల్దార్ పాపారావు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు.

డీ పట్టా భూములపై సర్వే

పోలాకి,న్యూస్‌టుడే: జొన్నాం, రామయ్యవలస, ప్రియాగ్రహారం, వనితమండలం, కొండకొత్తపేట గ్రామాల్లో డీ పట్టా భూములపై సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి ఇటీవల ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు తహసీల్దారు ఎం.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్ఐ సతీష్, మండల సర్వేయర్ బృందం మంగళవారం జొన్నాం గ్రామంలో వివరాలు సేకరించారు.

పేరు మార్చారు

స్పందనకు వందనం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చాలని ఉత్తర్వులు జారీ చేసింది. నరసన్నపేట మండలం ఉర్లాంలో కేంద్రం పేరు మార్చకపోవడంతో పాటు నిర్వహణను పట్టించుకోకపోవడంపై ఈనెల 23న 'తీరు మారలే.. పేరు మారలే' శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి, చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఎంసీ డీఈగా శ్రీహరి

శ్రీకాకుళం నగరం: శ్రీకాకుళం నగరపాలక సంస్థ(ఎస్ఎంసీ) డీఈగా డి.శ్రీహరి నియమితులయ్యారు. ఈయన గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ)లో డీఈగా పని చేస్తున్నారు. ఆమదాలవలస పురపాలక సంఘం ఎన్విరాన్‌మెంట్ ఏఈ బి.సృజన, జీవీఎంసీలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న కె.రాధికలకు ఎస్ఎంసీ ఏఈలుగా స్థాన చలనం కల్పించారు. శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పరిపాలన అధికారి సీహెచ్ శాంతకుమారిని పార్వతీపురం పుర కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

తెరపై ఈనాడు

● కీర్తన: ఏఆర్ఎం ● కీర్తి: 100 క్రోర్స్ ● కిన్నెర సినీమాక్స్: 35 చిన్న కథ కాదు ● ఎవీఎస్(రామలక్ష్మణ): సరిపోదా శనివారం ● సూర్యమహల్: మత్తు వదలరా-2 ● సరస్వతి: గొర్రె పురాణం ● చంద్రమహల్: కళింగ ● మారుతి: బొమ్మరిల్లు – న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఆదిత్య కళాశాల విద్యార్థినుల రక్తదానం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కొకిలాద ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది విద్యార్థినులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వారిని అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, కళాశాల డైరెక్టర్ బి.ఎస్. చక్రవర్తి, ప్రిన్సిపల్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సరుబుజ్జిలి మండలం చిన్నకాకితాపల్లిలో మహిళ యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి, బూర్జ, ఎచ్చెర్ల(రణస్థలం), జి.సిగడాం, ఆమదాలవలస పట్టణం, ఆమదాలవలస గ్రామీణం, గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కూటమి నేతలు పేర్కొన్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సరుబుజ్జిలి మండలం చిన్నకాకితాపల్లి, సిందువాడ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు తప్పనిసరిగా అందజేస్తామన్నారు. 2021లో వీరమల్లిపేటలో పిడుగుపాటు గురై మృతి చెందిన పదో తరగతి విద్యార్థి బోయిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4 లక్షల అందజేశారు. ★ రణస్థలం మండలం పాతర్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. ★ బూర్జ మండలం కటకమయ్యపేట, టీఆర్ రాజుపేట, డొంకలపర్త, తుడ్డలి, జేకేపాడు, బోరగంవలస తదితర గ్రామాల్లో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ★ శ్రీకాకుళం నగరం 18వ డివిజన్‌లో కృష్ణాపార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 40 ఏళ్ల అనుభవంతో రాష్ట్రాభివృద్ధికి పరుగులు పెట్టిస్తున్నారన్నారు.

పరిసరాలు శుభ్రం చేశారు

స్పందనకు వందనం

జి.సిగడాం: సీతంపేట పంచాయతీ నక్కపేట గ్రామంలో తాగునీటి ట్యాంకు వద్ద పరిసరాలు గడ్డి మొక్కలతో అపరిశుభ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో ఈ నెల 24న 'ఇదేనా శుభ్రత' శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మంగళవారం కార్యదర్శి గార వైదేహి ఆధ్వర్యంలో పరిసరాలు శుభ్రం చేసి పనికి రాని మొక్కల్ని తొలగించారు. తాగునీటి పథకంలో క్లోరినేషన్ చేపట్టారు.

నెరవేరని లక్ష్యం..!

అందుబాటులోకి రాని చెత్త నిర్వహణ కేంద్రాలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే

శ్రీకాకుళం నగరపాలకసంస్థ అధికారుల అనాలోచిత నిర్ణయంతో చేపట్టిన పలు భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం వృథా అయింది. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలో నిత్యం ఇంటింటి నుంచి సేకరించే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరే చేసి సంప్రదాయ ఎరువు, రీసైక్లింగ్ ఉపయోగపడే ఇనుము, ఇతర సామగ్రి విక్రయాల ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడ్డాయి.

◆ పొడి చెత్త నుంచి రీసైక్లింగ్ వస్తువులను వేరు చేయడానికి ఖాజీపేట నీటి సరఫరా కేంద్రం, గుజరాతీపేట వద్ద జన్మభూమి ఉద్యానం ప్రాంతంలో రూ.1.30 కోట్ల వ్యయంతో రెండేళ్ల కిందట చెత్త నిర్వహణ కేంద్రాల (జీటీఎస్) నిర్మాణం చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన ఈ పనులు శ్లాబు దశకు చేరుకుని నిలిచి పోయాయి. వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు 96.08 లక్షలు చెల్లించినప్పటికీ సకాలంలో బిల్లులు అందకపోవడంతో నత్తనడకన సాగాయి. టెండర్లు ఖరారైనప్పటి ధరలతో పోలిస్తే ప్రస్తుతం పెరిగిపోయాయి.



గుజరాతీపేట వద్ద జన్మభూమి ఉద్యానంలో అసంపూర్తిగా జీటీఎస్ భవన నిర్మాణం

◆ మిగిలిన పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాల్సిన నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడ్డాయి. ఇప్పటికే ఖర్చు చేసిన నిధులు వృథా అయ్యాయి. నగరపాలక స్థలాలు నిరుపయోగంగా మారాయి.

◆ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యక్రమం ప్రారంభంలో ఖాజీపేట వద్ద తాత్కాలిక ప్రాతిపదికన షెడ్లు ఏర్పాటు చేశారు. పొడి చెత్తలోని రీసైక్లింగ్ వ్యర్థాలను వేరు చేయడానికి పనులు చేపట్టారు. వీటిని ప్రామాణికంగా తీసుకునేందుకు ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘాలకు చెందిన ప్రజారోగ్య విభాగం అధికారులు క్షేత్ర పరిశీలన చేశారు. కొన్ని నెలల పాటు చేపట్టిన ఈ పనులు అధికారుల పర్యవేక్షణ లేక నిలిచిపోయాయి. యథావిధిగా నగరంలో సేకరించిన పొడి చెత్తను తండ్యావలస డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ గుట్టలుగా పడేస్తున్నారు.

పనులు పూర్తి చేసేలా చర్యలు: జీటీఎస్ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. కొన్ని రోజుల్లో ప్రతిపాదనలు రూపొందించి టెండర్లు పిలుస్తాం. **- పీవీవీడీ ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలకసంస్థ**

ఇళ్ల మధ్యనే మురుగునీరు



శ్రీకాకుళం నగరంలోని సత్యసాయినగర్ కాలనీలో సీసీ కాలువల్లేక మురుగునీరు నివాస సముదాయాల మధ్య ఖాళీ స్థలాల్లో, రహదారుల పక్కన నిలిచిపోతోంది. దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ నిధుల లభ్యత ఆధారంగా కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

దుర్గంధం భరించలేకున్నాం..!

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధి ప్రధాన రహదారి, పాత ఆమదాలవలస, గేటు, ఐజేనాయుడు కాలనీ, కంద్రపేట, ప్రభుత్వ కళాశాల వీధి, కృష్ణాపురం తదితర ప్రాంతాల్లో కాలువల నుంచి తీసిన పూడికను సకాలంలో తరలించకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వారం రోజుల పాటు వదిలేస్తుండటంతో దోమల బెడద, దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. కుళాయి నీరు పట్టుకోలేకపోతున్నామని పుర ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ పి.బాలాజీప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



ముప్పు తప్పించారు..!



స్పందనకు వందనం

గార వద్ద వంశధార నదిలో జలవనరులశాఖ అధికారులు సూచించిన చోట కాకుండా వేరే ప్రాంతంలో డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తవ్వుతున్నారు. దీంతో సమీపంలోని వరద గట్టు కుంగిపోయి సీఎస్పీ రహదారికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఈ నెల 21న 'పొంచి ఉన్న ముప్పు' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దానిపై అధికారులు స్పందించారు. తహసీల్దారు రమణారావు మంగళవారం ఇసుక ర్యాంపును పరిశీలించారు. అధికారులు సూచించిన ప్రాంతంలో తవ్వకాలు జరిపేలా చర్యలు చేపట్టారు. **– న్యూస్‌టుడే, గార**

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

జి.సిగడాం మండలం పెంట గ్రామంలో కొలువైన అసిరి తల్లి, చెవిటిపోలమ్మ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరువీధి వైభవంగా సాగింది. పాత పెంట, నాగులవలస, లింగాపురం గ్రామాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామ శివారులో అమ్మవారి వనం వద్ద చెవిటిపోలమ్మకు దండకంతో ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కలు చెల్లించారు. కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్చారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. **–న్యూస్‌టుడే, జి.సిగడాం**



నారాయణపురానికి తగ్గిన వరద



ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటంతో నదులు, గెడ్డలు, వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహించాయి. నాగావళి నదికి నీటి ప్రవాహం తగ్గడంతో బూర్జ మండలం నారాయణపురం ఆనకట్ట వద్ద సుమారు 5 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని జలవనరుల శాఖ జేఈ కొత్తకోట రాంబాబు తెలిపారు. తోటపల్లి, మడ్డువలస జలాశయాల నుంచి నీరు రావడం తగ్గుముఖం పట్టిందన్నారు. లాభాం, కాఖండ్యాం, చీడివలస, గంగంపేట, తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు మంగళవారం వేటలో నిమగ్నమయ్యారు. అర కిలో నుంచి పది కిలోల బరువున్న చేపలు వలకు చిక్కాయి. **– న్యూస్‌టుడే, బూర్జ**

పట్టణ మార్కెట్లతో ఆర్థిక స్వావలంబన



మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మెప్మా పీడీ రమణ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అర్బన్ మార్కెట్ల ద్వారా స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌సీ) ఆర్థిక స్వావలంబన సాధించవచ్చునని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పీడీ ఎస్.వి.రమణ అన్నారు. శ్రీకాకుళం నగరంలో రైతుబజార్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సంఘాల ఉత్పత్తులు ఒకే చోట విక్రయించేందుకు ఈ మార్కెట్లు దోహదపడతాయన్నారు. శ్రీకాకుళం నగరంలో వారానికి రెండు రోజులు, ఇతర పురపాలక సంఘాల్లో ఒక రోజు చొప్పున మార్కెట్లు నిర్వహించనున్నట్లు వివరించారు. అవకాశాన్ని మెప్మా పరిధిలోని స్వయంశక్తి సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది వెంకటరావు, బి.భాస్కరరావు, వి.రామారావు, తదితరులు ఉన్నారు.

రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలి



ప్రదర్శనగా వెళ్తున్న దళిత సంఘాల నాయకులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేసిన ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజును తక్షణమే అరెస్టు చేయాలని జిల్లా దళిత సంఘాల ఐకాస నాయకులు డిమాండు చేశారు. శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైట్ కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఐకాస నాయకుడు, కె.రాంగోపాల్ కార్యక్రమంలో దళిత సంఘాల ఐకాస నాయకులు తైక్వాండో శ్రీను, కంఠ వేణు, జి.గురుమూర్తి, ఎస్.రమణ పాల్గొన్నారు.

దిగుబడులు పెరిగేలా సహకారం



రణస్థలం మండలం కోష్ట వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు

ఎచ్చెర్ల(రణస్థలం), పొందూరు, ఆమదాలవలస గ్రామీణం, జి.సిగడాం, ఎచ్చెర్ల, గార, కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని లాభసాటి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. దిగుబడులు పెరిగేలా సహకారం అందిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రారంభమైంది. రణస్థలం మండలం కోష్ట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావులను రైతులు ఘనంగా సత్కరించారు. రైతులు అధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పొందూరు మండలం గోరింట, దల్లవలస గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గార మండలం శాలిహుండంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. కొంక్యాణపేట వద్ద వ్యవసాయాధికారులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు.



గార మండలం కొంక్యాణపేట వద్ద పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్



పచ్చదనం పెంపొందించాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: వర్సిటీ ప్రాంగణంలో జాతీయ సేవా పథకం వాలంటీర్లు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి శుభ్రంగా ఉంచాలని డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. రెక్టార్ బిడ్డికి అడ్డయ్య, రిజిస్ట్రార్ పీలా సుజాత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 విజన్ పేరిట తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యువత, విద్యార్థులు, మేధావులు సూచనలు, సలహాలు ఇచ్చి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలోని ఆమె ఛాంబర్‌లో మంగళవారం ప్రభుత్వం 12 అంశాలతో రూపొందించిన కరదీపికను జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారిణి వీఎస్ఎస్ఎల్ ప్రసన్న, సహాయ గణాంక అధికారిణి వి.శ్రీదేవిలతో కలిసి ఆవిష్కరించారు.

29న జీఈసీ స్టోర్స్ సమావేశం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం బొందిలీపురంలోని కార్యాలయంలో ఈ నెల 29న మహాజన సభ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్ లిమిటెడ్ మేనేజర్ జి.లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

భాజపాలో సభ్యులుగా చేరండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ(భాజపా)లో సభ్యులుగా చేరాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం పిలుపునిచ్చారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులో సీనియర్ నాయకులు రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భైరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజల కేంద్రం ప్రారంభం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరం ఆర్ట్స్ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. అనంతరం కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.సురేఖ, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడికి అభినందన

సరుబుజ్జిలి మండలం రొట్టవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఆంగ్ల అధ్యాపకుడు ఆర్.వి.రమణమూర్తిని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల ఆయన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణారావు, పలువురు ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎన్ఎస్ఎస్ పీవో రమేష్‌సాహును సత్కరిస్తున్న అధ్యాపకులు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎం.నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు మాట్లాడుతూ సరుబుజ్జిలి మండలంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనంతరం పీవోను సత్కరించారు.

అమ్మో పాము..!



పొందూరు మండలం తాడివలస ఉన్నత పాఠశాల స్నానాల గదిలో మంగళవారం పాము ప్రవేశిస్తుండటాన్ని గమనించిన విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. వర్షాకాలం కావడంతో పాఠశాల ఆవరణలో సర్పాలు తిరిగే ప్రమాదం ఉందని విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ప్రధానోపాధ్యాయుడు బల్ల కంటయ్య సూచించారు.

– న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

గృహ నిర్మాణాలపై పూర్తి వివరాలు అవసరం

పొందూరు, ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: పొందూరు మండలంలో తెదేపా, వైకాపా ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలకు సంబంధించి పూర్తి వివరాలు పక్కాగా ఉండాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ బి.నగేష్ సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మన ఇళ్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి సమాచారం సేకరించాలని తెలిపారు. ఎంపీడీవో హరిహరరావు తదితరులు పాల్గొన్నారు. ★ గాజులకొల్లివలస వద్ద ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను పురపాలక కమిషనర్ పి.బాలాజీప్రసాద్ ఆదేశించారు. పురపాలక కార్యాలయంలో మంగళవారం గృహ నిర్మాణ సంస్థ ఏఈ, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ పీడీ నగేష్

ఎన్నాళ్లీ వెతలు..!



అమ్మనగర్‌లో బీసీ వసతి గృహానికి వెళ్లే మట్టి రోడ్డు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే

ఆమదాలవలస పురపాలక సంఘంలో సగానికి పైగా వార్డులు పట్టణానికి దూరంగా ఉండటంతో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా కాలువలు లేవు. మట్టి దారులు అభివృద్ధికి నోచుకోలేదు. వైకాపా పాలనలో సమస్యలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటుందని పుర ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పార్వతీశంపేట, జగ్గుశాస్త్రులుపేట, తిమ్మాపురం, వెంగళరావుకాలనీ, కుద్దిరాం, ఐజేనాయుడు కాలనీ, కృష్ణాపురం, మెట్టక్కివలస, వరదా వారి వీధి, మోనింగి వారి వీధి, ఊసవానిపేట, బీఆర్ నగర్, చింతాడ, నాదానపురం, నందగిరిపేట, కాళింగమన్నయ్యపేట, సనపలవానిపేట, పంతులుపేట, గేదెలవానిపేట తదితర వార్డుల్లో ఇప్పటికీ మట్టి రహదారులే ఉన్నాయి. ఎక్కడికక్కడ మురుగు నీరు నిల్వ ఉండటంతో ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల సీసీ రహదారులు ఉన్నా ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగు నీరు పారుతోంది. ఈగలు, దోమలు బెడద ఎక్కువగా ఉందని.. ఫాగింగ్ చేపట్టడం లేదని స్థానికులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువల్లో పైపులైన్లు ఉండటంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



కంద్రపేట వద్ద మురుగు కాలువలో తాగునీటి పైపులైన్

దోమల బెడదతో ఇబ్బంది

మా ప్రాంతంలో దోమల బెడద ఎక్కువ. పైపులకు మరమ్మతులు చేపట్టి అలాగే వదిలేయడంతో మురుగు నీరు కుళాయిల్లోకి రావడంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. పురపాలక అధికారులు ఫాగింగ్, సకాలంలో పూడిక తొలగించడం, తాగునీటి పైపుల మరమ్మతులకు తీసిన గోతులు పూడిస్తే మేలు.

- డా.పి.తాతయ్యలు, వరదా వారి క్వార్టర్స్, ఆమదాలవలస

సమస్యలు లేకుండా చూస్తాం..

అన్ని వార్డుల్లో పూడికతీత పనులు చేపట్టాం. త్వరలోనే ఫాగింగ్ చేయిస్తాం. కాలువల్లో పైపు లైన్లు ఉంటే వాటిని తప్పించి సమస్యలు లేకుండా చూస్తాం. పుర ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

-పి.బాలాజీప్రసాద్, పురపాలక కమిషనర్, ఆమదాలవలస

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



పాతనిమ్మతొర్లాడ వద్ద ఇసుక పోగులను సీజ్ చేస్తున్న ఎస్సై వెంకటేష్, రెవెన్యూ అధికారులు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలో నాగావళి తీర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రాంబాబు, ఎస్సై వెంకటేష్ స్పష్టం చేశారు. 'ఈనాడు'లో ఈనెల 20న 'నాగావళి తీరాన ఇసుక తోడేళ్లు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. తోటాడ పంచాయతీ పరిధి పాతూరు, కొత్తవలస ఇటుక బట్టీల వద్ద 90, సేపేనపేట వద్ద 70 క్యూబిక్ మీటర్ల ఇసుక సీజ్ చేశామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా నాగావళి తీరంలో అన్ని రేవుల వద్ద ఇసుకను సీజ్ చేయాలని పాతూరు ఇటుక బట్టీల వద్ద ఇసుక నిల్వ చేసిన గుత్తేదారులు రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. పాతనిమ్మతొర్లాడ, కొత్తవలస ఇటుక బట్టీల వద్ద సీజ్ చేసిన ఇసుకను గాజులకొల్లివలస, తిమ్మాపురం వద్ద ఎన్టీఆర్ గృహాల నిర్మాణానికి తరలిస్తున్నారు. అధికారులు వస్తున్నారని తెలుసుకున్న పలువురు గుత్తేదారులు నిల్వ చేసిన ఇసుక కుప్పలను ట్రాక్టర్లతో చదును చేసి నెరిపివేయించారు.

ముందు తరలిస్తే ఊరుకోం..: సేపేనపేట వద్ద సీజ్ చేసిన ఇసుకను ముందు తరలించాలని అనంతరం కొత్తవలస, పాతూరు ఇటుక బట్టీల వద్దకు వెళ్లాలని నిల్వ చేసిన వారు డిమాండ్ చేశారు. సేపేనపేట వద్ద ఇసుకను తరలించడానికి వెళ్లిన లారీలను గుత్తేదారులు అడ్డుకున్నారు. ముందు పాతనిమ్మతొర్లాడ వద్ద ఇసుకను తరలించాలని డిమాండ్ చేశారు. ఎస్సై వారికి ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. సేపేనపేటలో మొదలుపెట్టి కొత్తవలస, పాతూరు ప్రాంతాల్లో సీజ్ చేసిన ఇసుక తీసుకెళ్తామని అధికారులు చెప్పడంతో వారు శాంతించారు.